

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 01-08-2026 | సంపుటి - 31 | సంచిక - 68 | రూ : 4 | పేజీలు: 8

## సీఎం రేవంత్‌ది బాధ్యతారాహిత్యం

- ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అనడం దురదృష్టకరం
- ఫీజురీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారన్న అక్కసుతోనే ఈ మాటలు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



2లో

## 10 వరకు సర్

- మరోసారి గడువు పెంపు
- 17న ముసాయిదా జాబితా ప్రచురణ



# మీ పెట్టుబడికి.. మాదీ పూచీ



- సీఐఐ నార్తర్న్ రీజియన్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు
- ఫ్యూచర్ సిటీకి ఫార్చ్యూన్ 500 కంపెనీలు రావాలన్నది లక్ష్యమని వెల్లడి

హైదరాబాద్: ''తెలంగాణ అంటే వ్యాపారం. అంతేకాదు పెట్టుబడులకు సురక్షిత గమ్య స్థానం కూడా. దినదిన ప్రవర్ధమానంగా పారిశ్రామికాభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోంది. ఇక్కడికి రండి.. పెట్టుబడులు పెట్టండి.. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుకండి మీ పెట్టుబడులకు మా ప్రజాప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సీఐఐ ప్రతినిధులను ఆహ్వానించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో శుక్రవారం సీఐఐ నార్తర్న్ రీజియన్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ''ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదు. 2004 వరకు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అనేక పెట్టుబడులను ఆకర్షించారు. బిల్ గేట్స్, బిల్ క్లింటన్ లాంటి దిగ్గజాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయి. 2014 నుంచి 2023 వరకు భారాస పాలనలో వాళ్లు కొన్ని విధానాలు తీసుకొచ్చారు. వాటిని కొనసాగిస్తూనే మేము సరికొత్త పాలసీలు తీసుకొచ్చాం. నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకొస్తే.. అదీ కొనసాగుతోంది. మేము తీసుకొచ్చిన తరువాయి 2లో

## రక్షణ రంగం కొత్త మైలురాయి
## ఆర్మీ ఆవిష్కరించిన స్వదేశీ డీజిల్




- ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ వినూత్న తరహా డీజిల్ ఆవిష్కరణ
- మైనస్ 42 డిగ్రీల చలిలోనూ సమర్థంగా పనిచేసే ఇంధనం
- స్వదేశీ పరిజ్ఞానంతో సైన్యం, ఆయిల్ కంపెనీల సంయుక్త రూపకల్పన
- హిమాలయాల్లో సైనిక వాహనాల సమర సన్నద్ధత పెంపు
- ఆత్మనిర్భర్ భారత్ దిశగా రక్షణ రంగంలో కీలక ముందడుగు

భారత సైన్యం సరిహద్దుల్లో తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత శీతల, మంచు ప్రాంతాల్లో సైనిక వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్' డీజిల్‌ను (ఎక్స్‌డబ్ల్యూజీ) ఆర్మీ చీఫ్ జనరల్ తరువాయి 2లో

## కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం..
## ఆరుగురి మృతి



- మహారాష్ట్రలోని థానే జిల్లా భివండిలో ఘటన
- శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకున్నట్లు అనుమానం
- ఓ మహిళను సజీవంగా రక్షించిన ఎన్‌డీఆర్ఎఫ్
- భవనం ఒరగడంతో కొందరు ముందే బయటకు
- ప్రత్యక్ష సాక్షుల కళ్లముందే ఘోర ప్రమాదం
- శిథిలాల తొలగింపు కొనసాగిస్తున్న సహాయక బృందాలు

2లో

## భోగాపురం.. ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం: ప్రధాని మోదీ

- భోగాపురంలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కీలక జాతీయ రహదారి ప్రాజెక్టులు జాతికి అంకితం
- సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన ప్రధాని మోదీ



2లో

## భారత్‌పై ట్రంప్ ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.. కొత్త దౌత్య వ్యూహం సిద్ధం




- ట్రంప్ కొత్త వ్యూహంలో భారత్‌కు ప్రాధాన్యం
- ఆసియాపై దృష్టి పెంచనున్న అమెరికా
- చైనా ప్రచారాన్ని ఎదుర్కోవడమే లక్ష్యం
- డిజిటల్ వేదికలకు అధిక ప్రాధాన్యం
- షార్ట్ వీడియోలు, పోడ్‌కాస్ట్‌లపై ఫోకస్
- యూఎస్ఏజీఎం అధిపతి సారా రోజర్స్ వెల్లడి

ట్రంప్ ప్రభుత్వ కొత్త ప్రజా దౌత్య వ్యూహంలో భారత్‌కు కీలక స్థానం దక్కింది. ఆసియాపై మరింత దృష్టి సారిస్తూ విదేశాల్లో సమాచార వ్యాప్తి తరువాయి 2లో

## భోగాపురంలో ఎయిర్ పోర్ట్ ప్రారంభించనున్న మోదీ..



2లో

- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష
- తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశం
- థింసా నృత్యంతో ప్రపంచ రికార్డు సృష్టించాలని సూచన
- ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలకాలని దిశానిర్దేశం

# సీఎం రేవంత్‌ది బాధ్యతారాహిత్యం

ఢిల్లీ: ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అనడం సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండున్నరేళ్లలో విద్యాశాఖ మంత్రిగా తీసుకొచ్చిన మార్పులేమిటో తెలపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'హార్వర్డ్ యూనివర్సిటీ వీకెండ్ క్లాసులో నేర్చుకున్న రెండు పదాలను ఇక్కడికొచ్చి వాడేద్దామనే ప్రయత్నంలో.. జెన్ జీని అవమానిస్తున్నారనే విషయాన్ని సీఎం మర్చిపోయినట్టున్నారు. తెలిసీ తెలియని పదాలను వాడి తానేదో మేధావినని నిరూపించుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరం. అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత సీఎం.. ఇంజినీరింగ్ విద్యా ప్రమాణాలపై ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో? ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయమని అడుగుతున్నారనే అక్కసుతో విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటు. రూ.10,000 కోట్ల ఫీజు బకాయిలు ఉండగా, అందులో రూ.5,000 కోట్లకుపైగా ఇంజినీరింగ్ విద్యార్థులకు చెల్లించాల్సి ఉంది. వీటిని ఇవ్వలేక సీఎం ఫ్రస్ట్రేషన్‌లో విద్యార్థులను క్రిమినల్స్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేస్తే.. 'తమాషాలు చేస్తే తాట తీస్తా'మని సీఎం మాట్లాడారు. ఫీజు బకాయిలు అడిగితే విద్యాసంస్థలపై విజిలెన్స్‌తో దాడులు చేయించారు. ఎన్నికల సమయంలో బడ్జెట్‌లో విద్యాశాఖకు 15% కేటాయిస్తామన్న హామీని రేవంత్ అటకెక్కించారు.

**నాడు కేసీఆర్.. చేసిందేమీ లేదు**

ఇంజినీరింగ్ విద్యార్థుల స్టాండర్డ్స్ సరిగ్గా లేవని ఎవరో చెబితే తనకు సిగ్గుపోయినంత పనైందని 2015లో నాటి సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా చెప్పారు. మన విద్యార్థులవి వానాకాలం చదువులని నాడు ఆయన విమర్శించారు. ఈ ప్రకటన చేసిన తర్వాత ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నా.. ఈ రంగంలో మార్పు కోసం కేసీఆర్ చేసిందేమీ లేదు. వాస్తవానికి హైదరాబాద్ ఐటీ కేంద్రంగా ప్రపంచ ఖ్యాతిని పొందడంలో ఇక్కడి విద్యార్థుల పాత్ర లేదా? ఇక్కడి నుంచి వెళ్లిన వాళ్లు అంతర్జాతీయ ఐటీ కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో లేరా? అలాంటి విద్యార్థులను కేసీఆర్, రేవంత్‌రెడ్డి తక్కువ చేసే ప్రయత్నం చేశారు. ఇంజినీరింగ్ విద్యలో మరింత నాణ్యత పెంచాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు కలిసి ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడంలో చొరవ తీసుకోవాలి. అంతేకానీ విద్యార్థులను కించపరిచేలా మాట్లాడకూడదు' అని కిషన్‌రెడ్డి సూచించారు.

## భారత్‌పై ట్రంప్ ప్రభుత్వ ప్రత్యేక దృష్టి..

# కొత్త దౌత్య వ్యూహం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

విధానాన్ని మార్చేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత్, జపాన్ వంటి దేశాలకు ప్రాధాన్యం పెంచనున్నట్లు అమెరికా గ్లోబల్ మీడియా ఏజెన్సీ (యూఎస్ఏజీఎం) డైరెక్టర్ పదవికి నామినేట్ అయిన సారా రోజర్స్ వెల్లడించారు. అమెరికా సెనేట్ విదేశాంగ వ్యవహారాల కమిటీ ముందు మాట్లాడిన రోజర్స్.. ఆసియా తమ ప్రాధాన్య ప్రాంతాల్లో ఒకటిగా ఉంటుందని చెప్పారు. చైనా, ఇతర నిరంకుశ దేశాల దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు కొత్త వ్యూహం అవసరమని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, రేడియో ఫ్రీ యూరప్ వంటి అంతర్జాతీయ ప్రసార సంస్థలను యూఎస్ఏజీఎం నిర్వహిస్తోంది. భారత్, జపాన్‌లో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఆ దేశాలపై తాను ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రోజర్స్ తెలిపారు. ఈ దేశాలకు సంబంధించిన పోస్టులను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేసినట్లు చెప్పారు. సంప్రదాయ రేడియో, టెలివిజన్‌కే పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే డిజిటల్ వేదికలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో షార్ట్ వీడియోలు, పాడ్‌కాస్ట్‌లు, ప్రవాస భారతీయుల గ్రూప్ చాట్‌లు కూడా సమాచార వ్యాప్తిలో కీలక పాత్ర పోషిస్తాయని రోజర్స్ పేర్కొన్నారు. స్వతంత్ర సమాచారం అందుబాటులో లేని దేశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. చైనాతో వాణిజ్యం, సాంకేతిక రంగం, రక్షణతో పాటు సమాచార రంగంలోనూ పోటీ పెరుగుతున్న వేళ ఈ మార్పులు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# భోగాపురం.. ఆధునిక ఎయిర్ పోర్టుకు ప్రతిరూపం: ప్రధాని మోదీ

ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించే ఈ ప్రాజెక్టుల వివరాలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వీటిలో ప్రధాన ఆకర్షణగా విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తోంది. ఈ విమానాశ్రయానికి సంబంధించిన ఆకర్షణీయమైన ఫొటోలను కూడా ప్రధాని పంచుకున్నారు. భోగాపురం విమానాశ్రయం ఒక ఆధునిక, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా నిర్మించిన ప్రాజెక్టు అని ప్రధాని అభివర్ణించారు. కనెక్టివిటీ, వాణిజ్యం, పర్యాటకాన్ని ఇది గణనీయంగా పెంచుతుందని తెలిపారు. సుస్థిరత, ఇంధన సామర్థ్య సూత్రాలను పాటిస్తూ ఈ విమానాశ్రయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. వీటితో పాటు మరిన్ని కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నట్లు మోదీ వెల్లడించారు. భోగాపురంలో ఏఎస్ఐపి సెమీకండక్టర్ ప్రాజెక్టుకు, అలాగే కర్నూలు IV పునరుత్పాదక ఇంధన జోన్




(ఆర్ఈజెడ్) మొదటి దశ అనుసంధానానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో, రాష్ట్రంలో పూర్తయిన కొన్ని కీలకమైన రహదారి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నట్లు ప్రధాని తన పోస్టులో వివరించారు. వీటిలో ఎన్ హెచ్ 365బీజీ పరిధిలోని రేచెర్ల గురువాయిగూడెం మధ్య నాలుగు వరుసల రహదారి, గురువాయిగూడెం దేవరపల్లి సెక్షన్, ఎన్ హెచ్ 67పై నిర్మించిన తాడిపత్రి బైపాస్ ఉన్నాయని పేర్కొన్నారు. విమానయానం, సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, రహదారి రవాణా వంటి కీలక రంగాల్లో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం..

# ఆరుగురి మృతి

మహారాష్ట్రలోని థానే జిల్లా భివండిలో నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. 'జాతీయ విపత్తు స్పందన దళం' (ఎన్‌డీఆర్ఎఫ్), 'రాష్ట్ర విపత్తు స్పందన దళం' (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాలు ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టాయి. బుధవారం అర్ధరాత్రి భవనం ఒకవైపు ఒరిగినట్లు గుర్తించారు. ప్రమాదాన్ని గమనించిన కొందరు కార్మికులు వెంటనే బయటకు వెళ్లడంతో కొంత వరకు ప్రాణనష్టం తప్పినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆ సమయంలో భవనంలో మరమ్మతు పనులు జరుగుతున్నట్లు సమాచారం. శిథిలాల నుంచి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో మహిళను సజీవంగా రక్షించి ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం నుంచి బయటపడిన దీపక్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. భోజనం చేసి నిద్రపోతుండగా ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించిందన్నారు. బయటకు రాగానే భవనం కూలిపోవడం కనిపించిందని చెప్పారు. ప్రాణాలు కాపాడుకోవడానికి మొదటి అంతస్తు నుంచి దూకానని తెలిపారు. మరో బాధితుడు అభయ్ కుమార్ యాదవ్ కూడా మొదటి అంతస్తు నుంచి దూకి బయటపడ్డాడు. ఈ ఘటనలో అతడి కాలికి తీవ్ర గాయమైంది. స్థానికురాలు నేహా సింగ్ మాట్లాడుతూ.. తన భర్త రంజిత్ సింగ్ కిందికి వెళ్లిన పది నిమిషాల్లోనే భవనం కూలిపోయిందన్నారు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవనంలో సుమారు 45 గదులు ఉండగా, ఘటన సమయంలో 25 నుంచి 30 మంది ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. భారీ శిథిలాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఎదురవుతోందని అధికారులు వెల్లడించారు.

# రక్షణ రంగం కొత్త మైలురాయి.. ఆర్మీ ఆవిష్కరించిన స్వదేశీ డీజిల్

(మొదటిపేజీ తరువాయి)

ధీరజ్ సేథ్ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు. సాధారణంగా డీజిల్ అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద గడ్డకట్టి వాహనాల ఫిల్టర్లను మూసివేస్తుంది. అయితే, ఈ నూతన ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా సమర్థంగా పనిచేస్తుంది. బీఎస్ VI ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఇంధనాన్ని, ప్రస్తుత సైనిక వాహనాల్లో ఎటువంటి సాంకేతిక మార్పులు చేయకుండానే నేరుగా వినియోగించవచ్చు. భారత సైన్యం, ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమన్వయంతో కేవలం ఏడాది వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ ఆవిష్కరణను ఆర్మీ చీఫ్ 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. ఇది సైనిక వాహనాల కదలికలను సులభతరం చేయడమే కాకుండా, సమర సన్నద్ధతను మరియు కార్యాచరణ విశ్వసనీయతను గణనీయంగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. శీతాకాలంలో వాహనాలను స్టార్ట్ చేసేందుకు గతంలో అనుసరించిన ప్రమాదకర పద్ధతులకు ఇది స్వస్తి పలుకుతుందని, తద్వారా సైనిక సిబ్బంది భద్రతతో పాటు మనోధైర్యం పెరుగుతుందని ఆయన వివరించారు. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో చేపట్టిన ఈ కృషి, భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక ఇంధనాల తయారీకి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. కేవలం సైనిక అవసరాలకే కాకుండా, తీవ్రమైన చలి ఉండే ప్రాంతాల్లో పౌర రవాణా అవసరాలకు కూడా ఈ డీజిల్ ఎంతగానో దోహదపడనుంది. ఈ కార్యక్రమానికి ముందు, ఆర్మీ చీఫ్ తూర్పు సెక్టార్‌లోని సైనిక ఫార్మేషన్లను రెండు రోజుల పాటు సందర్శించి, అక్కడి భద్రతా సన్నద్ధతను మరియు వరద సహాయక చర్యలను సమీక్షించారు.



## భోగాపురంలో ...

# ఎయిర్ పోర్ట్ ప్రారంభించనున్న మోదీ..

విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నేడు (ఆగస్టు 1) ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విమానాశ్రయ పనుల పురోగతిపై ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా'ను కళ్లుచెదిరే స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానికి అత్యంత ఘనంగా స్వాగతం పలకాలని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# మీ పెట్టుబడికి.. మాదీ పూచీ

హైదరాబాద్: ''తెలంగాణ అంటే వ్యాపారం. అంతేకాదు పెట్టుబడులకు సురక్షిత గమ్య స్థానం కూడా. దినదిన ప్రవర్ధమానంగా పారిశ్రామికాభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోంది. ఇక్కడికి రండి.. పెట్టుబడులు పెట్టండి.. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుకండి మీ పెట్టుబడులకు మా ప్రజాప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సీఐఐ ప్రతినిధులను ఆహ్వానించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రితో శుక్రవారం సీఐఐ నార్తర్న్ రీజియన్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ''ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదు. 2004 వరకు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అనేక పెట్టుబడులను ఆకర్షించారు. బిల్ గేట్స్, బిల్ క్లింటన్ లాంటి దిగ్గజాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయి. 2014 నుంచి 2023 వరకు భారాస పాలనలో వాళ్లు కొన్ని విధానాలు తీసుకొచ్చారు. వాటిని కొనసాగిస్తూనే మేము సరికొత్త పాలసీలు తీసుకొచ్చాం. నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకొస్తే.. అదీ కొనసాగుతోంది. మేము తీసుకొచ్చిన పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. మంచి ప్రతిపాదనలతో వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది మా లక్ష్యం. గత డిసెంబరులో గ్లోబల్ సమిట్ ఏర్పాటు చేశాం. ఈ సదస్సులో 175 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీని గ్లోబల్ సమిట్‌లో ప్రకటించాం. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉంది. అది 10 శాతంగా ఉండాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం.

**క్యూర్.. ప్యూర్.. రేర్‌గా అభివృద్ధి**

కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబయి, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధి చేస్తున్నాం. ప్యూర్, రేర్ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతో పాటు.. ఇతర వసతులు కల్పిస్తాం. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మించనున్నాం. వరంగల్, ఆదిలాబాద్‌లలో ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. 7 బుల్లెట్ ట్రైన్లను కేంద్రం ప్రకటిస్తే.. 3 తెలంగాణకు వచ్చాయి. మేం పొరుగు రాష్ట్రాలతో పోటీ పడదల్చుకోలేదు. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీ పడి.. చైనా ప్లస్ వన్‌గా తెలంగాణను నిలపడమే మా లక్ష్యం.

**నైపుణ్యాభివృద్ధిపై దృష్టిపెట్టాం**

తెలంగాణ సంస్కృతి మాకు పెద్ద ఆస్తి. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారు. ఇక్కడ పెట్టుబడులు పెడితే.. పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుంది. పారిశ్రామికవేత్తలు వారికి ఏం కావాలో చెబితే.. ఆ వసతులు కల్పిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారు. పరిశ్రమల శాఖ మంత్రి రెండు నెలలకోసారి.. నేను మూడు నెలలకోసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తాం. తెలంగాణను మీ సొంత ప్రాంతంగా భావించాలి. ఏఐ సునామీతో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయి. దీంతో మేము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాం. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నాం. ఇక్కడ డేటా సెంటర్లపైన అమెజాన్ రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెడుతోంది. అదానీ గ్రూప్ రూ.35 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ నార్తర్న్ రీజియన్ ఛైర్మన్ పునీత్ కౌరా, వైస్ ఛైర్‌పర్సన్ శ్రద్ధా సూరి మార్వా, ప్రతినిధులు కృష్ణ బోధనపు, గౌరవ్ మహేశ్వరి, వనిత దాట్ల, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వినోద్ కె బాప్న తదితరులు పాల్గొన్నారు.

# 10 వరకు సర్

హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ఎన్యూమరేషన్ ఫారాల దాఖలు గడువును ఆగస్టు 10వ తేదీ వరకు కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. నిర్ణీత గడువులోగా ఫారాలు పూర్తిచేసి, ఓటర్లు సంబంధిత బీఎల్‌వోలకు అప్పగించాల్సి ఉంటుంది. సర్ ప్రక్రియలో భాగంగా తొలుత జులై 24 వరకు గడువు ఇచ్చింది. అనంతరం ఆగస్టు 3 వరకు పొడిగించగా, తాజాగా మరోసారి గడువు పొడిగించింది. ఓటర్ల ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆగస్టు 17న ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రచురించనుంది. దీనిపై సెప్టెంబరు 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి.. అక్టోబరు 15 నాటికి వాటిని పరిష్కరించనుంది. తుది ఓటర్ల జాబితాను అక్టోబరు 19న కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

**77.12 శాతం డిజిటలైజేషన్ పూర్తి..**

రాష్ట్రంలో 3.3 కోట్ల మంది ఓటర్లున్నారు. వీరందరికీ నూరు శాతం ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు పంపిణీ చేశారు. వాటిని పూర్తిచేసి ఆయా ఓటర్లు బీఎల్‌వోలకు అందిస్తున్నారు. తీసుకున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు డిజిలైజేషన్ చేస్తున్నారు. దరఖాస్తు ఫారాల్లోని వివరాలను నమోదు చేయడంతోపాటు 2002 జాబితాలోని ఓటర్ల వివరాల ఆధారంగా యాప్‌లో పొందుపరుస్తున్నారు.

# పోలీస్ ఉద్యోగం సేవకు ప్రతీక.. ఆరోగ్యాన్ని విస్మరించొద్దు

* పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సంకీర్త్ ఘన సన్మానం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ప్రజల భద్రత కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలందించే పోలీసు సిబ్బంది త్యాగం అమూల్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేసిన రిటైర్డ్ అధికారుల సేవలు పోలీస్ శాఖకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ ప్రశాంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అధికారులు *ఎండి. ఫజల్ ఉల్లా ఖాన్ (ఎస్సై - షీటీం), జే. సమ్మిరెడ్డి (ఏఎస్ఐ - ఘణపురం పోలీస్ స్టేషన్), ఎస్. ఉపేందర్ (ఏఆర్ఎస్ఐ - హెడ్క్వార్టర్స్)*లను ఎస్పీ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా మైనార్టీ మోర్చా నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు గ్యన్ సింగ్ ఆధ్వర్యంలో మైనారిటీ మోర్చా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులందరికీ పార్టీ కండువాలు కప్పి, అధికారికంగా బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మైనారిటీ మోర్చా నాయకులు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షులుగా గ్యన్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నిరుడి లాజర్, సయ్యద్ గౌస్ పాషా, ఉపాధ్యక్షులు: కరమ్ సింగ్, షేక్ మొహమ్మద్, ఎండీ ఖలీల్, కార్యదర్శులుగా ఎండీ నవబొద్దీన్, అజయ్ సింగ్, కోశాధికారి గా పర్వేజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు: సర్వన్ సింగ్, అమర్ సింగ్, పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, పాపన్నపేట మండల అధ్యక్షులు సంతోష్ చారి, మరియు జిల్లా నాయకులు లోకేష్, మధు, రాజు, శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట వికసిత్ భారత్ ఉద్యోగుల నల్లబ్యాడ్జీల నిరసన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,(ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ గ్రామీణ్ మిషన్ ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. పే స్కేల్‌ను ఆగస్టు 15లోపు అమలు చేయాలని, ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే, ఎస్ఆర్డీఎస్ బోర్డు నిర్ణయాలను అమలు చేయడంతో పాటు, సెలవు దినాల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు తగిన ప్రయోజనాలు కల్పించాలని, వేతనాల జాప్యానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఉద్యోగుల క్యాడర్, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్మెంట్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎస్.ఐ.అర్ డిజిటలైజేషన్ లో జిల్లాకు తొలి స్థానం

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో 99.79 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసి రాష్ట్రం లో తొలి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ లో భాగంగా 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న 13 కేంద్రాలను గుర్తించి, అవసర మైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పా టుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా, నివా సం మార్చుకున్న ఓటర్ల వివరాలను నవీకరించేలా చర్యలు చేపడుతున్నా మని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పేర్కొన్నారు.

# నేర నియంత్రణతో పాటు శాఖ అభివృద్ధికి వారు చేసిన కృషి ప్రశంసనీయం

* సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.యం. రమేష్



సైబరాబాద్ ప్రజాస్ఫూర్తి : శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సేవ, నేర నియంత్రణతో పాటు శాఖ అభివృద్ధికి వారు చేసిన కృషి ప్రశంసనీయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.యం. రమేష్ పేర్కొన్నారు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో పదవీ విరమణ పొందిన ఏడుగురు (07) పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.యం. రమేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని, తమ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో ప్రజలకు, పోలీస్ శాఖకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.. వారి సేవాభావానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచర అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని ఆత్మీయంగా నిర్వహించారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్. కిషన్ సింగ్, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎల్. రాజేశ్వర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ ఖాదీర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఎస్ఐ మహమ్మద్ మక్సూద్ ఘూరీ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జలీల్, ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహమ్మద్ నూర్ ఉద్దీన్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ హెచ్‌సీ గెనుగుల రమేష్ లు పదవి విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) టి. అన్నపూర్ణ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర, సైబర్ క్రైమ్ డీసీపీ కె. పుష్ప, డీసీపీ (కార్ హెడ్‌క్వార్టర్స్) పి. సంజీవ్, ఏడీసీపీ షమీర్, సీఏఓ (అకౌంట్స్) వెంకట్ రెడ్డి, ఏఓ (అడ్మిన్) వై.వి.ఎస్. జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్, కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి ఎస్ఐ జి. మల్లేశం తదితరులు పాల్గొని విరమణ పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

: సిందం శ్రీకాంత్ యాదవ్



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు, బాధ్యతారహిత వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిందం శ్రీకాంత్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీసం మంత్రిగా కూడా సరైన పరిపాలనా అనుభవం లేని వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయడం వల్ల పరిపాలనలో వైఫల్యాలు కనిపిస్తున్నాయని, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి నోటికి వచ్చినట్లు మాట్లాడటం రాష్ట్ర ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తోందని ఆయన విమర్శించారు.నిన్న *మరి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ లో జరిగిన కార్యక్రమంలో ఇంజనీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రతి ఏడాది లక్షా పది వేల మంది ఇంజనీర్లు తయారవుతున్నారు. కానీ వారికి సరైన నైపుణ్యాలు లేవు. కనీసం బయోడేటా కూడా రాయడం తెలియదు. క్రిమినల్ వేస్ట్" అని చేసిన వ్యాఖ్యలు తెలంగాణ యువ ఇంజనీర్ల ప్రతిభను తీవ్రంగా అవమానపరిచే విధంగా ఉన్నాయని సిందం శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఐటీ సంస్థలు హైదరాబాద్‌లో చదువుకున్న ఇంజనీర్లను పెద్ద ఎత్తున నియమించుకుంటుంటే, మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తెలంగాణ ప్రతిష్ఠను, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దిగజార్చే చర్యేనని ఆయన పేర్కొన్నారు.గతంలో కూడా తెలంగాణ రాష్ట్రం అప్పులపాలైందని, ఎవడు నమ్మి పరిస్థితులు లేవని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర పెట్టుబడి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపాయని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి చేసే ప్రతి వ్యాఖ్య దేశ, విదేశాల్లో ప్రతిధ్వనిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకొని బాధ్యతాయుతంగా మాట్లాడాలని, లేకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పెట్టుబడులు, యువత ఉపాధి అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటాయని సిందం శ్రీకాంత్ హెచ్చరించారు.

# మారు మూల ప్రజలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ ధ్యేయం

* మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిలో శుక్రవారం ఐడీబీఐ బ్యాంకు సహకారంతో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, హైదరాబాద్, ఓమెగా ఆసుపత్రి కరీంనగర్ వైద్య బృందాలు నిర్వహించిన ఉచిత క్యాన్సర్, కంటి నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని తెలిపారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు హెల్త్ ఏటీఎం, పెరిమీటర్, ఈసీజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. హెల్త్ ఏటీఎం ద్వారా 64 రకాల పరీక్షలను వేగంగా నిర్వహించవచ్చని, పరీక్షల వివరాలు ఐదేళ్ల పాటు భద్రంగా ఉండేలా కార్డు అందజేస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. శ్రీకాంత్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, ఆర్డీవో రవీందర్, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ రవీంద్రనాథ్, అంకాలజిస్టు డా. సంతోష్‌రెడ్డి, సర్పంచ్ హసీనా భాను అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తి, వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

* వర్షపు నీటిని వెంటనే బయటకు పంపాలని రైతులకు సూచన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు శనివారం మొగుళ్లపల్లి మండలంలోని ప్రత్తి, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. కె. మదన్ మోహన్ రెడ్డి రైతులకు పంటల సంరక్షణపై కీలక సూచనలు చేశారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పొలాల్లో నిల్వ ఉన్న నీటిని కాలువల ద్వారా వెంటనే బయటకు పంపాలని సూచించారు. ప్రత్తి పంటలో ఆకుమచ్చ తెగులు, రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆకుమచ్చ నివారణకు ఎకరానికి 200 మి.లీ. ప్రోపికోనజోల్ పిచికారీ చేయాలని, రసం పీల్చే పురుగుల నివారణకు అసిఫేట్ లేదా ఇమిడాక్లోప్రిడ్ మందులను సూచించిన మోతాదులో పిచికారీ చేయాలని తెలిపారు.వరిలో మొగి పురుగు లక్షణాలు, దాని వల్ల కలిగే నష్టాన్ని రైతులకు వివరించారు. నారుమడిలోనే నివారణ చర్యలు చేపట్టాలని, నారు పీకే ముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లాలని సూచించారు. నాట్లు వేసిన 10 నుంచి 15 రోజులలో కార్బోఫ్యూరాన్, కార్టప్ హైడ్రోక్లోరైడ్ లేదా క్లోరాన్ట్రానిలిప్రోల్ గుళికలను సిఫారసు చేసిన మోతాదులో వినియోగించాలని తెలిపారు. ఉధృతి అధికంగా ఉన్నప్పుడు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ లేదా క్లోరాన్ట్రానిలిప్రోల్‌ను పిచికారీ చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ క్షేత్ర సందర్శనలో మండల వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు నూతన్, రాకేష్‌తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నరసంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఘన నివాళి



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన నరసంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల సిఎంసి నిజాంపేట సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ,సీనియర్ నాయకులు, మహిళా నాయకులు,యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షా కాలంలో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గూడూరు మండలంలోని అయోధ్య పురంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని ప్రాథమిక కేంద్ర పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి, లార్వాలను తొలగిస్తూ, ఇంటి పరిసరాల్లో గల కూలర్ లలో నీరు,కొబ్బరి చిప్పలు, రోళ్ళు, నీటి తొట్టిలు, నీరు నిల్వ ప్రాంతాలలో దోమలు పుట్టకుండా లార్వాలను తొలగించాలని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని, దోమలు కుట్టకుండా ఇంటి ద్వారలకు, కిటికీలకు, మెష్ డోర్లను అమర్చుకోవాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా తీసుకోవాల్సిందిగా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా జిల్లాలో గల సూపర్వైజర్లకు, ఏఎన్ఎంలకు,ఆశలకు సూచించారు.ఈ కార్యక్రమంలో గూడూరు మండల వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్, సూపర్వైజర్,ఆశాలు పాల్గొన్నారు.

# టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జిఎం కు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలం రాజు ఉద్యోగ విరమణ సందర్భంగా టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ ఆధ్వర్యంలో ఆయనకు శాలువ కప్పి ఘనంగా సన్మానిస్తూ పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కాపుకృష్ణ మాట్లాడుతూ గత 38 సంవత్సరాలు సుదీర్ఘంగా ,సింగరేణి సంస్థలో సేవలందించి ఎందరోకో ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఆయన సేవలను కొనియాడుతూ, ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో కుటుంబ సమేతంగా ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు గడప రాజయ్య, సెంట్రల్ కమిటీ నాయకులు గిన్నారపు మహేందర్, ఫిట్ సెక్రటరీ నమిల్ల వెంకటేశ్వర్లు,గోల్కొండ నవీన్, కిష్టారం పిట్ సెక్రటరీ కే ఆంజనేయులు,దివ్య, అనుదీప్, ఎన్ శంకర్, దేవ్ సింగ్ ,కిరణ్ కుమార్ ,గంధమల్ల దుర్గ, గణపాక,అన్వర్ పాషా , తిరుపతి ,విద్యాసాగర్, పాల్గొన్నారు.

# గాంధీ పార్క్ అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోండి

* **సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ అజయ్ సారథి రెడ్డి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డులో గల గాంధీ పార్క్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని స్థానిక 33 వ వార్డు కౌన్సిలర్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి కోరారు. ఈ సందర్భంగా గాంధీ పార్కును చైర్ పర్సన్ జ్యోతితో కలిసి పర్యటించి అనంతరం గాంధీ పార్క్ అభివృద్ధికి కృషి చేయాలని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీ పార్క్ లో సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు శ్రీరామ కళ్యాణం, సైన్స్ ఫెయిర్లు విద్యావినోద అనేక సంబంధించిన సభలు కార్యక్రమాలు జరుగుతాయని దీనికోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.గాంధీ పార్క్ పట్టణం నడిబొడ్డున అన్ని వర్గాలకు ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జ్యోతి రమేష్ మాట్లాడుతూ గాంధీ పార్క్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, నర్రా శ్రావణ్, అజ్మీర వేణు, మాలోత్ రవీందర్, నీలం వెంకటేశ్వర్లు, పడిదల కవిత, విక్కీ సాయి, ఎండి యూసుఫ్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ పాడి గేదెల సబ్సిడీ రుణాలను ప్రజలు వినియోగించుకోవాలి

* **పురపాలక సంఘం కమిషనర్ తాటి మల్లికార్జున గౌడ్**

హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుతం 202627 ఆర్థిక సంవత్సరానికి పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి డెయిరీ (పాడిగేదెలు/ఆవులు) యూనిట్లను సబ్సిడీపై అందించనున్నది. కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, బ్యాంకు ఖాతా వివరాలు ఉంటే సరిపోతుంది. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాడి యూనిట్లకు తగిన ఆర్థిక సబ్సిడీ, బ్యాంకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఇవ్వబడుతుంది. ఒక్కో యూనిట్ కు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల మధ్య బ్యాంకు అనుసంధానంతో రుణం ఇచ్చి ఇందులో 80 శాతం వరకు రాయితీ ఇవ్వనుంది. ప్రతి డెయిరీ యూనిట్కు 2 లేదా 3 గేదెలు పంపిణీ చేస్తారు. అదేవిధంగా గేదెలకు షెల్టర్ కోసం ప్రత్యేక షెడ్ ఏర్పాటు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాజెక్టు యూనిట్ విలువలో కొంత మొత్తాన్ని కేటాయిస్తారు.దీంతోపాటు ఆరునెలలకు సరిపడా పశుగ్రాసం కోసం అవసరమైన నిధులకు కూడా ప్రత్యేక మొత్తాన్ని నిర్దేశిస్తారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటున్న అధికారులు యూనిట్ విలువ కనీసం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉండేలా అంచనాలు రూపొందించారు.ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

* **నియోజకవర్గానికి 200 యూనిట్లు..**

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ జిల్లాలో 400 కోట్లతో కోహెడ మండలానికి 67 యూనిట్లు, అక్కన్నపేటకు 66 యూనిట్లు, హుస్నాబాద్ కు 35, హుస్నాబాద్ అర్బన్ కు 32 యూనిట్లకు దరఖాస్తులు చేసుకోవచ్చు....

* **హుస్నాబాద్ అర్బన్ కి 32 యూనిట్లకే దరఖాస్తూ మాత్రమే**

యూనిట్లు ఉన్నందున వారం రోజులలో దరఖాస్తులు చేసుకోవచ్చు అనిపురపాలక సంఘం కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జీళ్ళచెరువు గ్రామంలో ఘనంగా కలుశ ఊరేగింపు



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో స్థానిక భక్త భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ విశ్వ హిందు పరిషత్ సౌజన్యంతో శుక్రవారం అత్యంత వైభవంగా కలుశ ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇంటింట భక్తులు కలుశం కు జలాభిషేకం చేసి, పూజలు చేశారు. భక్తులు జై శ్రీరామ్ అంటూ వీదివీదిన తిరుగుతూ స్వామివారి కలుశంను భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా రామాలయంలో కలుశంకు ప్రధాన అర్చకులు ముడుంబా శ్రీమన్నారాయణ చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్త కమిటి బాధ్యులు చెన్నా వెంకన్న, అంబాల సైదులు, పెంద్ర అంజయ్య, చెన్నా విజయ్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గోగుల అంజయ్య, కొండపల్లి రాములు, అంబాల సత్యనారాయణ, దొంతగాని వీరబాబు, బెజవాడ శ్రీకాంత్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# 1950కు ఎస్ఎంఎస్‌తో ఓటరు వివరాలు తెలుసుకోండి

**: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను తెలుసుకోవడం ఇప్పుడు మరింత సులభమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రతి ఓటరు తమ ఎన్నికల గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్‌ను టైప్ చేసి 1950 నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపడం ద్వారా ఓటు నమోదు వివరాలను మొబైల్ ఫోన్‌లోనే సందేశంగా పొందవచ్చని చెప్పారు. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని, అవసరమైతే ఓటరు నమోదు, సవరణలు, మార్పులు వంటి ప్రక్రియలను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.

# వెలుగుమట్లను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం...

* **హౌజింగ్ పిడి శ్రీనివాస్**
* **301 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగింపు**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఖమ్మం నగరంలోని వెలుగుమట్లను అన్ని వసతులతో కూడిన ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగుమట్లలో అర్హులైన 301 మంది నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలను మంజూరు చేయడంతో పాటు, 301 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. వెలుగుమట్ల లో గుడిసెలు వేసుకొని ఉన్న వారిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్వంత స్థలాలు కలిగిన 101 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేసినట్లు, ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. వెలుగుమట్లలో గుడిసెలు వేసుకొని ఉన్నామని 8 వేల మంది దరఖాస్తులు చేసుకోగా, అట్టి దరఖాస్తుల సమగ్ర విచారణ చేపట్టి, అర్హులకు ఇండ్లు మంజూరుకు చర్యలు తీసుకోనున్నట్లు హౌజింగ్ పిడి అన్నారు. ఇళ్ల నిర్మాణం మరింత వేగంగా పూర్తయ్యేలా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) ద్వారా 124 మంది లబ్ధిదారులకు రూ.1 లక్ష చొప్పున రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకునే అవకాశం కలుగుతోందన్నారు.వెలుగుమట్ల కాలనీని ఆదర్శ కాలనిగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.10 కోట్ల వ్యయంతో మౌళిక సదుపాయాల పనులు చేపట్టిందన్నారు. కాలనీలో అంతర్గత సీసీ రహదారులు, విద్యుత్ కనెక్షన్లు, త్రాగునీటి సౌకర్యం, ప్రహరీ గోడ, పార్కు, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, అంగన్‌వాడీ కేంద్రం, వీధి దీపాలు, ప్రాథమిక పాఠశాల, తదితర అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.ఇళ్ల నిర్మాణ పనులు, మౌళిక వసతుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్ని పనులను పూర్తి చేసి 2026 డిసెంబర్ 9న వెలుగుమట్ల ఆదర్శ కాలనీని ప్రారంభించడమే ప్రభుత్వ లక్ష్యమని హౌజింగ్ పిడి శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రంలోనే ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



ప్రజాస్ఫూర్తి/ఖమ్మంజిల్లా : రాష్ట్రంలోనే ఏదులాపురం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో తన కార్యాలయంలో ఏదులాపురం మున్సిపల్ కౌన్సిలర్లతో మంత్రిగారుసమావేశమయ్యారు.ఈ సమావేశంలోమున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆలోచన, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని , ప్రజలు ముఖ్యం ప్రజా ప్రయోజనాలే ప్రధానంగా పేదోడి సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మొదటి విడతలో రూ.100 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అనంతరం రెండో విడతలో మరో రూ.100 కోట్లు కేటాయించి మిగిలిన మౌలిక వసతుల పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన నిరుపేద కుటుంబాలకుఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పారదర్శక పాలనకు ప్రజాప్రతినిధులు సహకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# పంట మార్పిడి విధానంపై సబ్సిడీ పొందవచ్చును




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కొత్తగూడ మండలంలో పంట మార్పిడి విధానం కార్యక్రమంలో భాగంగా రైతు బానోతు బిచ్చ, బానోతు సుమన్ పొలంలో ప్రాజెక్టు వైవిధ్యం కింద జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రక్రియ పరిశీలించి లబ్ధిదారులు బంగారి సాంబలక్ష్మి,గట్టి సుగుణ లతో మాట్లాడి గృహాలను వెంటనే నిర్మించుకోవాలని సూచించారు.గాంధీనగర్ లోని గిరిజన బాలికల గురుకులమును పరిశీలించి విద్యార్థిని, విద్యార్థుల యొక్క విద్యాసామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు, అనంతరం వారితో మాట్లాడి వారి యొక్క అభిప్రాయాలను భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టు వైవిధ్యం ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట మార్పిడి విధానం ద్వారా రైతులు బానోతు బిచ్చ, బానోతు సుమన్, పంట పొలంలో పెసర్లు,విత్తనాలు చల్లుతున్న రైతులతో స్వయంగా మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా వరి, మక్కజొన్న, పత్తి, మిర్చి, లే కాకుండా ఇతర పంటలు ఆయిల్ పామ్ , కందులు, పెసర్లు, వేరుశనగ, లెమన్ గ్రాస్,తదితర లాభదాయకమైనటువంటి పంటలు వేయుటకు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, రైతులు ప్రతి ఒక్కరూ పంట మార్పిడి విధానం ద్వారా కూరగాయలు, పూలు, పండ్ల, పంటలు, సాగు చేయాలని అందుకోసం అధిక మార్కెట్ ఉంటుందని తెలిపారు, అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతున్న ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు లబ్ధిదారులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా స్వయం సహాయక బృందాల చేత ఆర్థిక సహాయం అందించాలని, ఇప్పటికే ప్రైవేటు సంస్థ ద్వారా గృహాల నిర్మాణం కోసం ఒప్పందాలకు విరుచుకొని నిర్మాణాలు కొనసాగుతున్నాయని, మంజురాయి వివిధ దశలో ఉన్న డబ్బులను వెంటనే అందరికీ ఇవ్వాలని,అర్హులైన వారికి పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అట్టి పథకాన్ని కచ్చితంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు,అనంతరం గిరిజన గురుకుల, పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థిని ,విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి వివరాలు ఆశయాలను అభిప్రాయాలను అడిగి తెలుసుకుని భవిష్యత్తు ప్రణాళికలు ద్వారా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.స్టాక్ ను స్వయంగా తనిఖీ చేశారు,అక్రమంగా యూరియా ,డిఏపి, నన్ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు,ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరామ్ నాయక్, ఏ డి ఏ శ్రీనివాసరావు,అని విభాగాల సంబంధిత అధికారులు, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

* **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కొందుర్గు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం పరిస్థితులు మారే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి, మండలంలోని పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ అజం అలీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోగూరి పురుషోత్తం రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జితేందర్, దామోదర్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, మల్లేష్ గౌడ్, బ్యాటరి కృష్ణారెడ్డి, రాములు గౌడ్, కేకే కృష్ణ, సర్పంచ్‌లు విక్రమ్, అంజి, రాజ్‌కుమార్, రమేష్, ప్రభాకర్, అశోక్, యాదయ్య, మల్లయ్య, రామస్వామి, మనయ్య, నర్సింలు, గోపాల్, రాజేందర్ గౌడ్, జంగయ్య, జీపీఓలు హరీష్, నరేష్, శ్రీకాంత్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వైద్య సహాయం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి; మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.మహబూబాబాద్ శాసనసభ్యులు డా" భుక్య మురళి నాయక్ పాల్గొని, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన అర్హులైన లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి,ఆపద సమయంలో నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో ఊరటనిస్తాయని తెలిపారు.తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుండి అర్హులైన లబ్ధిదారులు,తమ కష్టకాలంలో నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి ఘన నివాళి



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : మాజీ శాసనసభ్యులు, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శ న్ రెడ్డి అకాల మరణం పట్ల లింగాల ఘణపురం మండల కేంద్రం లో బీఆర్ ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కా ర్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మా ట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా లో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరి ష్కారం లో పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని, ప్రజల మధ్యే ఉండే నాయకుడిని కోల్పోవడం తీరని లోటు అని పేర్కొన్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇంచార్జ్ చౌదర్పల్లి శేఖర్, సర్పంచ్ ఎడ్ల లావణ్య రాజు, వడిచర్ల సర్పంచ్ చెరుకు కార్తీక్, ఉప సర్పంచ్ గట్టగల్ల రాజయ్య, మాజీ ఎంపీటీసీ గండి యాదగిరి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎదునూరి వీరన్న, గ్రామ శాఖ అధ్యక్షులు కేమిడి యాదగిరి, దూ సరి వెంకన్న, లింగాల వెంకటేష్,గట్టగల్ల శ్రీహరి, గండి చంద్రశేఖర్, కేమిడి రాజు, బంద్రు సత్తయ్య, గట్టగల్ల నాగరాజు, వే ముల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# దేవునిపల్లి గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి బోర్ వేయించిన బీఆర్ఎస్ సీనియర్ నేత



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఫరూఖ్ నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్, గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు బోర్ వేయించి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు రవీందర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవలందిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి గౌడ్, శ్రీనివాస్, గోవిందు, రవీందర్, బాలకృష్ణ తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇన్ముల నర్వ గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు

*** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కొత్తూరు మండలంలోని ఇన్ముల నర్వ గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామాభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో కొత్తూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ సి.హెచ్. అరుంధతి, తహసీల్దార్ శ్రీమతి ముంతాజ్, కొత్తూరు సీఐ నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు చర్చించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.5.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరు కాగా, అందులో రూ.3 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే ఇన్ముల నర్వ గ్రామానికి రూ.5 కోట్ల వ్యయంతో ప్రయాణ ప్రాంగణం (బస్ స్టాండ్) మంజూరైనట్లు వెల్లడించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేకు పలు అభివృద్ధి వినతిపత్రాలను అందజేశారు. వాటిలో జేపీ దర్గా సమీపంలో గ్రామపంచాయతీ కార్యాలయ సముదాయం నిర్మాణం, జేపీ దర్గా ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు, ఇన్ముల నర్వ గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, స్మశానవాటిక వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, ఆధునిక వైద్యశాల ఏర్పాటు వంటి ప్రధాన డిమాండ్లు ఉన్నాయి. వినతులను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

# ఆరుతడి పంటల సాగుతో రైతుల ఆదాయం

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ,ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో పరిస్థి తుల నేపథ్యంలో వరి సాగుకు బదులు గా పెసర, నువ్వులు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రైతు లకు సూచించారు. బచ్చన్నపేట మండ లం ఎద్దుగూడెం లో రైతుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలిం చిన ఆయన, నీటి పొదుపుతో అధిక లాభాలు వచ్చే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. సమీకృత వ్యవసాయం, డ్రమ్ సీడింగ్ వంటి ఆధు నిక సాగు విధానాలను ప్రోత్సహించాల ని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు, పంటల వై విధ్యీకరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్..



జనగామ, ప్రజాస్ఫూర్తి : మండలం లోని గోపరాజుపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీ లించి పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రాథమిక నైపుణ్యాలు అందేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించగా, పాఠశా ల భవన మరమ్మతులు, మరుగుదొడ్ల పరిశుభ్రత, వైట్‌వాష్ పనులు చేపట్టాల ని అధికారులను ఆదేశించారు.

# సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

**: ఎమ్మెల్యే కూనంనేని**




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యుల సమావేశం శుక్రవారం పాల్వంచలోని సిపిఐ కార్యాలయం 'సిఆర్ భవన్'లో నిర్వహించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టడంలో, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో కేంద్రం విఫలమైందన్నారు. ప్రజలను చైతన్యపరచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి 14 వరకు పార్టీ ఆధ్వర్యంలో 'ప్రజా చైతన్య యాత్రలు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ , వివిధ మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3 లోపు ప్రతి ఓటరు గణన

# ఫారాన్ని సమర్పించేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు గణన ఫారాన్ని ఆగస్టు 3 లోపు తప్పనిసరిగా సమర్పించేలా రాజకీయ పార్టీలు చురుకుగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. 31,967 మంది మృతి చెందిన ఓటర్లు, 10,060 డబుల్ ఎంట్రీలు, 94 వేల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఇంకా సుమారు 31 వేల మంది ఓటర్లు గణన ప్రక్రియకు స్పందించడం లేదని, వీరిలో అధిక సంఖ్యలో ఖమ్మం నగరానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. ధృవీకరణ పత్రం అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 1,460 పోలింగ్ కేంద్రాల్లో 677 కేంద్రాల్లో 100 శాతం గణన ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, మరో 544 కేంద్రాల్లో 95 శాతం, 158 కేంద్రాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వోలు) సహకరించి ప్రతి ఓటరు సరైన వివరాలతో గణన ఫారం సమర్పించేలా చూడాలని సూచించారు. ఆగస్టు 3 గణన ఫారాల సమర్పణకు చివరి తేదీ అని, ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి, అక్టోబర్ 12, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డీఆర్వో సి.హెచ్. రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు

# వాంకిడిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

*** బీసీ వసతి గృహాన్ని వేరే భవనానికి తరలించాలి**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతి, సురక్షిత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కె. హరిత తెలిపారు. వాంకిడి మండల కేంద్రంలో ఒకే భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ, బీసీ వసతి గృహాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంటగది, స్టోర్‌రూమ్, విద్యార్థుల గదులు, స్నానపు గదులు, మరుగుదొడ్లు పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్లాబ్ ఉన్న గదుల్లోకి వర్షపు నీరు చేరుతున్నట్లు గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టి నీరు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకే భవనంలో రెండు వసతి గృహాలు కొనసాగడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న కలెక్టర్, గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్న అనువైన అద్దె భవనాన్ని గుర్తించి బీసీ వసతి గృహాన్ని వెంటనే అక్కడికి తరలించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన గదులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు ఉండే భవనాన్ని ఎంపిక చేయాలని సూచించారు.ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన వసతి, విద్య అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న భవనం అవసరాలకు పూర్తిగా అనుకూలంగా లేకపోవడంతో ఎస్సీ, బీసీ వసతి గృహాలకు ప్రత్యేక నూతన భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఉప తహసీల్దార్ రామ్‌లాల్, బీసీ సంక్షేమ వసతి గృహ అధికారి మధుకర్ తదితరులు తనిఖీలో పాల్గొన్నారు.

*** డిజిటలైజేషన్ వేగవంతానికి రాజకీయ పార్టీల**

**సహకారం అవసరం**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కె.హరిత కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 90 శాతం డిజిటలైజేషన్ పూర్తైందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రక్రియను వేగవంతం చేసి పూరించిన ఫారాలను బీఎల్‌వోలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం గడువును ఆగస్టు 3 వరకు పొడిగించినప్పటికీ, అంతకుముందే ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. సమావేశం అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

# పదవీ విరమణకు మొక్కతో శుభాకాంక్షలు

**: సంఘం వెంకట్ పుల్లయ్య**



ప్రజాస్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: పదవీ విరమణ సందర్భంగా శాలువా కప్పడం.. పూలమాల వేయడం.. బొకే, జ్ఞాపిక అందించడం సర్వసాధారణం. అయితే వీటికి భిన్నంగా మొక్కను బహుమతిగా ఇచ్చి.. దానిని నాటించి.. ప్రకృతి పరిరక్షణపై సందేశమిచ్చారు ప్రకృతి ప్రేమికులు. రామవరం జీహెచ్ఎస్‌లో 37 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా సేవలందించి వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేసిన ఎస్.వి.రాజు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష గౌరవాధ్యక్షుడు, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎస్.వి.రాజును ఘనంగా సన్మానించి.. ఆయనతో పాఠశాల ఆవరణలో మొక్క నాటించారు. అనంతరం సుమారు 50 మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ప్రకృతి ప్రేమికులు మాట్లాడుతూ.. పదవీ విరమణ, జన్మదినం, వివాహ వార్షికోత్సవం వంటి వేడుకల్లో పూలు, బొకేలు, ఇతర బహుమతులకు బదులుగా మొక్కలను అందించాలని కోరారు. మొక్కను నాటించడం ద్వారా ప్రకృతిని కాపాడటంతో పాటు భావితరాలకు పచ్చని వాతావరణాన్ని అందించవచ్చన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం భరత్‌కుమార్, ప్రకృతి ప్రేమికుడు ఎన్.రాజశేఖర్, ఉపాధ్యాయులు, రామవరం పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.డి. ముస్తఫా, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలు, ప్రకృతి వైద్యులు జి.సుగుణరావు, సంగం రఘురామ్, పర్వతారోహకుడు మోథీ కుమార్, దశరథ్ రజువా తదితరులు పాల్గొన్నారు.వీపున మొక్క.. ముక్కుకు ఆక్సిజన్ మాస్క్ ధరించి వినూత్నంగా ప్రకృతి పరిరక్షణపై ప్రచారం చేస్తున్న చిన్నారి ప్రకృతి ప్రేమికులు నైనిక రజువా, ఎం.డి.అఫాన్ జైదీ, అనేజా, ఎం.డి.అమన్, రాజు పాల్గొని మొక్కలు నాటారు. ఎస్.వి.రాజుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ కుటుంబానికి రూ.15 లక్షల భరోసా




ప్రజాస్ఫూర్తి , జయశంకర్ భూపాలపల్లి జిల్లా : విధి నిర్వహణలో అకాల మరణం చెందిన మహిళా కానిస్టేబుల్ సంగీత కుటుంబానికి బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద మంజూరైన రూ.15 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శుక్రవారం అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులతో కలిసి చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ సంగీత అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో ఇలాంటి సంక్షేమ పథకాలు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు, కానిస్టేబుల్ సంగీత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తపడాలి

*** హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి,**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో పురపాలక సంఘ చైర్మన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో 5 వ వార్డు లో సఫాయి అప్నా భీమారీ బగావో అనే కార్యక్రమము నిర్వహించారు. చైర్మన్ మరియు కౌన్సిలర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఎస్ ఏ బి బి కార్యక్రమం గురించి అవగాహన చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ దండి లక్ష్మీ మాట్లాడుతూ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని పాత టైర్లలో, కుండలలో రంజాన్లలో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని చేతులను పరిశుభ్రంగా కడుకోవాలని డయేరియా,డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి పరిసరాలలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకోవాలని చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని స్వచ్ఛతను పాటించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్లు బూరుగు లత, కొండ రజిత, తిరుపతి, బొలిశెట్టి రాజు,వరప్రసాద్, బొల్లి శ్రీనివాస్ వైద్యం కిరణ్ ప్రసాద్, బత్తుల స్వరూప,శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్ జవాన్ సారయ్య,శ్రీకాంత్ ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 8 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలి



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ఫీజు రీయింబర్స్ రియంబర్స్మెంట్ బకాయిలు 8 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణలు డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణన్న పిలుపుమేరకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నలగొండ జిల్లా కేంద్రంలో ఆర్డీఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి నల్గొండ జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు ఎనిమిది వేల కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని కోరారు. జీవో నెంబర్ 9 ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పాత విధానం ప్రకారమే ఫీజులు మంజూరు చేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వాగ్దానం ప్రకారం అన్ని కాలేజీ కోర్సులతో సహా అన్ని ఇంజనీరింగ్ ఫార్మసీ తదితర కోర్సులు పూర్తి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి 14లక్షల విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో ఉంచకుండా, అభివృద్ధి పథంలో ఉంచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్ ,జిల్లా ఉపాధ్యక్షులు పగిళ్ల సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు బక్కతట్ల వెంకన్న యాదవ్, దుగ్గిరాల లక్ష్మీనారాయణ, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ యాదవ్, జిల్లా కార్యదర్శి వీరమల్లు, నాగరాజు గౌడ్, అందం తిరుపతయ్య, రాపోలు సత్యనారాయణ, బొజ్జ దుర్గయ్య , పెద్ద ఎత్తున కళాశాల విద్యార్థులు విద్యార్థినిలు తదితరులుపాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు .

# సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జాప్యానికి తావుఇవ్వకూడదు

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు, ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించి కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటనకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

* **రెండో విడత లబ్ధిదారుల ఎంపిక త్వరి తగతిన పూర్తి చేయాలి...**




హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలని, గుడిసె నివాసితుల ధృవీకరణను ఆలస్యం లేకుండా పూర్తి చేసి అర్హుల జాబితాను వెంటనే సిద్ధం చేసి మంజూరు ప్రతిపాదనలు వెంటనే పంపించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా, ఆగస్టు 4న కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ పర్యటన నేపథ్యంలో పీఎండిడికెవై కింద జిల్లాలో అమలు చేయనున్న కార్యక్రమాలకు సంబంధించి ప్రతి శాఖ క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేసి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో కేంద్ర బృందం ముందు జిల్లాలోని పురోగతిని సమర్థవంతంగా వివరించేలా పూర్తి సన్నద్ధంగా ఉండాలన్నారు.

# రాయిన్ పల్లి ప్రాజెక్ట్ కెనాల్ కూలిపోవడంతో పాటు చెరువు కట్టకూ భారీ గండి

* **మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెదక్ మండలం రాయినపల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కూలిపోగా, చెరువు కట్ట కూడా సగానికి పైగా దెబ్బతినడంతో ఏడు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఘటనాస్థలిని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని తీవ్రస్థాయిలో విమర్శించారు. మూడు రోజుల వర్షాలకే కాల్వ కట్ట, చెరువు కట్ట దెబ్బతినడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఏడు గ్రామాలకు ప్రత్యక్షంగా, మరో పది గ్రామాలకు పరోక్షంగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కాల్వ దెబ్బతినడంతో రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే ఏడు గ్రామాల ప్రజలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో స్వయంగా కట్టను పూడ్చే కార్యక్రమం చేపడతామనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, మున్సిపల్ మాజీ చైర్మన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, రాయన్ పల్లి మాజీ సర్పంచ్ నాగులు, పార్టీ అధ్యక్షులు జంగం వీరస్వామి, మున్సిపల్ కౌన్సిలర్ లు, బిఆర్ఎస్ నాయకులు రైతులు తదితరులు ఉన్నారు.

# ఫార్ములా ఈ కార్ రేస్ కేసు పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమే

* **ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పార్ములా లాఈ కార్ అక్రమ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యే ముందు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన కొకపేట నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు ఈ భేటీలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కక్షసాధింపు చర్యలతో ఈ అక్రమ కేసు పెట్టిందని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచవ్యాప్తంగా పెంచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ అంతర్జాతీయ రేస్‌ను నిర్వహిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై అసత్య ఆరోపణలు చేస్తూ కేటీఆర్ గారిపై పై తప్పుడు కేసులు మోపిందని బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి దీనిని రాజకీయంగా, న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలో అధిష్టానం కి తెలుసని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తెలిపారు. ఈ భేటీ అనంతరం నేతలందరితో కలిసి కేటీఆర్ నాంపల్లి కోర్టుకు బయలుదేరి వెళ్లారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

: **బీఆర్ఎస్ నాయకులు**

* **షాద్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ షాద్ నగర్ పట్టణం శ్రీనగర్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నటరాజన్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, గౌస్ జానీ, గోపాల్, ఎస్పీ శివ, సర్పంచ్ గీత వీరేశం, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, యుగంధర్, జూపల్లి శంకర్, కానుగు అంతయ్య, నంద కిషోర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, లంకాల రాఘవేందర్ రెడ్డి, మల్లేష్, భువనేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి ఉగ్రరూపం.. యంత్రాంగం అప్రమత్తం

* **మూడో ప్రమాద హెచ్చరికకు అవకాశం..**
* **లోతట్టు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి**
* **భద్రాచలంలో 9 పునరావాస కేంద్రాలు..**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం, భద్రాచలం : గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా.. నీటిమట్టం మరింత పెరిగితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం కలెక్టర్ భద్రాచలం వద్ద గోదావరి వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితి, మోటార్ల పనితీరును ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటిని వేగంగా బయటకు పంపేలా మోటార్లను నిరంతరం నిర్వహించాలని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కరకట్ట, స్నానఘాట్ల వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను నదిలోకి అనుమతించరాదని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రమాద ప్రాంతాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

* **48 అడుగులకు చేరిన నీటిమట్టం**

గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 11.44 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందన్నారు. నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు వివరించారు. సమ్మక్క బ్యారేజ్ వద్ద సుమారు 14.6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

* **లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు మండలాల గోదావరి పరివాహక ప్రాంతాల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. గర్భిణీలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు 17 మంది గర్భిణీలను సురక్షితంగా ఆరోగ్య కేంద్రాలకు తరలించగా.. మరో 10 మందిని తరలించే ప్రక్రియ కొనసాగుతోందని వైద్యాధికారులు తెలిపారు.

* **9 పునరావాస కేంద్రాలు**

భద్రాచలం పట్టణంలో వరద ప్రభావిత ప్రజల కోసం తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైతే అదనపు కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, వైద్య సేవలు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

* **రహదారులపై నిఘా**

సారపాక-రెడ్డిపాలెం, తూరుబాక-దుమ్ముగూడెం ప్రధాన రహదారులను కలెక్టర్ పరిశీలించారు. గోదావరి నీటిమట్టం పెరిగితే సారపాక-రెడ్డిపాలెం మార్గంలో వరద నీరు చేరే అవకాశం ఉన్నందున అవసరమైతే వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. తూరుబాక-దుమ్ముగూడెం రహదారిపై ఇప్పటికే వరద నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేసి మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారికేడ్ల వద్ద నిరంతరం పోలీసు బందోబస్తు కొనసాగించాలని, ఎవరూ వరద నీటిలో ప్రయాణించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

* **జలపాతాలు, నదీ తీరాలకు వెళ్లొద్దు**

వాగులు, వంకలు, వరద నీటితో నిండిన రహదారులను ప్రజలు దాటకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, వాగులు, నదీ తీర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి సందర్శకులను అనుమతించరాదన్నారు.

* **24 గంటలు కంట్రోల్ రూమ్**

వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. ప్రజలకు సహాయం అందించేందుకు భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 08744241950కు ఫోన్ చేయాలని, 9392919743 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అధికారుల సూచనలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. గోదావరి ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదిలోకి దిగడం, సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లడం చేయరాదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ లేదా 100కు సమాచారం అందించాలని కోరారు.

# బిఎల్ఓలకు చీర సారతో ఘన సన్మానం




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరును కలిసి తమ వివరాలను సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అందజేసేందుకు విశేష కృషి చేసిన బిఎల్ఓలను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి సూచనలతో సర్ ప్రోగ్రాం ఇన్ ఛార్జ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా ఉపాధ్యక్షులు కుంట్ల వెంకట నాగిరెడ్డిలు శుక్రవారం మండలంలోని ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్ఐఆర్ కాంగ్రెస్ మండల ఇంచార్జ్ రమేష్ ఆధ్వర్యంలో సోలిపేట, రామచంద్రపురం, రత్నపురం, రామరం, దుబ్బ తండా, సపవత్ తండా, రాజు నాయక్ తండా, టేకుమట్ల గ్రామాలలో స్వంతింటి ఆడపిల్లకు సారె ఏ విదంగా అందిస్తారో అదే విధంగా సర్ ప్రోగ్రాంలో కష్టపడి నూటికి నూరు శాతం ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తిచేసిన ప్రతి మహిళా బిఎల్ఓలకు చీర పెట్టి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని బూత్ లలో సర్ ప్రక్రియను నూరు శాతం పారదర్శకంగా, సమర్థవంతమైన సమాచారంతో నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలను, నాయకులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాము అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు, నాయకుల సహకారం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు తాటిపాముల సుధీర్, గట్టు జ్యోతి శ్రీనివాస్, ఉయ్యాల ఆదినారాయణ, దాసరి శ్రీనివాస్, చింత కేశవులు, నక్క లింగయ్య, బిఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు జరిగే జిఎం ఆఫీస్ ముందు ధర్నా జయప్రదం చేయండి

* **ఎండి రజాక్ పిలుపు**



ప్రజాస్ఫూర్తి కొత్తగూడెం : ఐఎన్ టియుసి ఆధ్వర్యంలో మణుగూరు డిప్ సైడ్ బొగ్గు బ్లాక్ ను సింగరేణి సంస్థకే వచ్చే విధంగా చూడాలని నేడు జిఎం కార్యాలయం ముందు సాయంత్రం మూడు గంటలకు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పివికే ఫైవ్ ఇంక్లైన్ , వికే కోల్ మైండ్స్ , సివిల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులతో కలిసి జరిగిన సమావేశంలో ఐ ఎన్ టి సి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు .

# పెండింగ్ లో ఉన్న 10 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

* **బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్..**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : పెండింగులో ఉన్న పదివేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఐత గొని జనార్దన్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం, బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను విడుదల చేయాలని నల్లగొండ జిల్లా కేంద్రంలో కళాశాలన్నీ బహిష్కరించి, ర్యాలీ నిర్వహించి రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐతగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి విద్యార్థులకు రావాల్సినటువంటి న్యాయమైన ఫీజు రియంబర్స్మెంట్ ని స్కాలర్షిప్లని తక్షణమే విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులని తీర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ పెండింగ్లో ఉన్నటువంటి 10,000 కోట్ల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలని విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గురుకుల కళాశాలలకు పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలి ఫీజు రియంబర్స్మెంట్ కొనసాగించాలి రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే జీవో నెంబర్ 8 ,9 విడుదల చేసిందో దాన్ని రద్దు చేసి ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి చట్టం చేసి దాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందన్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ, డిగ్రీ తదితర కోర్సులు పూర్తయిన వారికి కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఏ కాలేజికి వెళ్ళి చూసిన విద్యార్థులు ఫీజులు కట్టలేక నరకయాతన అనుభవిస్తుంటే ప్రభుత్వం సంతోషంగా యుందా అని విమర్శించారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజుకు ఒక జీవో జారీ చేసి విద్యార్థులలో గందరగోళం సృష్టిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాలని లేకపోతే ఆగస్టు లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ విధానం పై ప్రభుత్వం తరపున స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు గందరగోళంకు గురవుతున్నారు. అందుకే ముఖ్యమంత్రి చొరవ తీసుకొని గత 18 సంవత్సరాలుగా కొనసాగుతున్న విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చేనా జీవో నెంబర్ 8 9 లతో స్పష్టత లేకపోవడం వలన తీవ్ర గందరగోళం ఏర్పడుతుందన్నారు. ఫీజులు విద్యార్థుల ఖాతాలోకి వేస్తామని పేర్కొనడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టమని ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. పైగా ప్రభుత్వం ఫీజులు విద్యార్థులు కట్టకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ క్రింద అరెస్టు చేస్తామని భయపెట్టడంతో విద్యార్థులలో భయందోళనలు చదువు పట్ల అనాసక్తి ఏర్పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తుంది. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇప్పటికే 4లక్షల కోట్లు అప్పు తెచ్చింది. 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం అభివృద్ధి కోసం మరో 10 వేల కోట్లు అప్పు తెస్తే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. న్యాయమైన ఈ సమస్యపై ప్రభుత్వం తాత్సారం చేస్తే భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు భారీ మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. వారంలో ఐదు లక్షల మంది విద్యార్థులతో హైదరాబాద్ నిర్బంధం చేస్తామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్ణాటక యాదగిరి, రజక అభివృద్ధి సంస్థ నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిలకరాజ సతీష్ ,విద్యార్థి సంఘం నాయకుడు కొంపల్లి రామన్న గౌడ్ , బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నబోయిన రాజు యాదవ్, పొగాకు రవికుమార్ యాదవ్ ,మల్లబోయిన తరుణ్ కుమార్ యాదవ్ ,యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనంత నాగరాజు గౌడ్ , యువజన సంఘం జిల్లా కార్యదర్శి గడగోజు విజయాచారి, విద్యార్థి సంఘం నాయకులు నాగేష్ ,హరిప్రసాద్ ,కృష్ణ ,మహేష్ ,శివ ,మధు ,మల్లేష్, నరేష్, పృథ్వీరాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం ఉద్యోగుల పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన




కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: వీబీజీ రామ్‌జీ ఉపాధి హామి పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగ సంఘం జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు కూసుమంచి మండలం ఉద్యోగులు పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు మ. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తూ, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, తమకు తగిన వేతన శ్రేణి లేకపోవడం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే వీబీజీ రామ్ జీ ఉపాధి హామి పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను పరిశీలించి మంజూరు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించే వరకు శాంతియుతంగా తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ కరుణ, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, హరి నాయక్, భవాని, శ్రీనివాస్, రవికాంత్, ఉద్యోగులు తులసీ పాల్గొన్నారు.

# ఎల్‌నీనో అంచనాలను తలకిందులు చేసిన వరుణుడు

* **వరుణుడి వరాలతో పల్లె పచ్చదనం.. వరుస వర్షా లతో ఊపందుకున్న ఖరీఫ్ సాగు**
* **రైతుల్లో చిగురించిన ఆశలు.. వేగం పుంజుకున్న వరి నాట్లు, పత్తి సాగు**







జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ఎల్‌నీనో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయని, వర్షాభావ పరిస్థితులు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన వేళ... ప్రకృతి అనూహ్యంగా తన కరుణ రైతుపై చూపింది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలు ఎల్‌నీనో అంచనాలను తలకిందులు చేస్తూ రైతుల్లో కొత్త ఆశలను నింపాయి. వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూసిన అన్నదాతలు ఇప్పుడు పొలాల బాట పట్టి ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశముందని భావించిన ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించింది. గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేశారు. అయితే ప్రకృతి ఒక్కసారిగా అనుకూలించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పొలాలు జలమయం అయ్యాయి. దుక్కులు, వరి నాట్లు, పత్తి విత్తనాల విత్తకం, ఇతర సాగు పనులు ఊపందుకున్నాయి. ట్రాక్టర్ల శబ్దాలు, నాట్లు వేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీల సందడితో గ్రామీణ ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. "ఈ వర్షం రైతుకు ప్రాణం పోసింది" అంటూ అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.వర్షాల ప్రభావంతో చెరువులు, కుంటలు, వాగులు నీటితో నిండుతుండగా భూగర్భ జలమట్టాలు కూడా పెరిగే అవకాశముందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో కూడా వర్షాలు కొనసాగితే ఖరీఫ్ సాగు లక్ష్యాలను మించిపోయే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

* **ఖరీఫ్ సాగు గణాంకాలు ఆశాజనకం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ జూలై 28 నాటికి విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లాలో ఇప్పటికే 1,07,053 ఎకరాల్లో పత్తి సాగు పూర్తికాగా, 28,595 ఎకరాల్లో వరి, 1,663 ఎకరాల్లో పెసర, 511 ఎకరాల్లో కందులు, 267 ఎకరాల్లో కూరగాయలు, 119 ఎకరాల్లో మొక్కజొన్న సాగు నమోదైంది.పత్తి సాగులో కాటారం మండలం 14,816 ఎకరాలతో అగ్రస్థానంలో నిలవగా, మహాముత్తారం 14,500 ఎకరాలు, చిట్యాల 14,100 ఎకరాలు, మొగుళ్లపల్లి 11,950 ఎకరాలు, రేగొండ 11,747 ఎకరాలు, టేకుమట్ల 10,310 ఎకరాలతో ముందంజలో ఉన్నాయి. వరి సాగులో కాటారం 5,070 ఎకరాలతో మొదటి స్థానంలో ఉండగా, మల్హర్‌రావు 3,900 ఎకరాలు, భూపాలపల్లి 3,828 ఎకరాలు, టేకుమట్ల 3,510 ఎకరాలు, మొగుళ్లపల్లి 3,345 ఎకరాలు సాగు నమోదైంది.

* **మళ్లీ చిరునవ్వులు చిందిస్తున్న అన్నదాత**

వర్షాభావ భయాలతో ఖరీఫ్ సాగుపై సందిగ్ధంలో ఉన్న రైతులకు తాజా వర్షాలు అపారమైన ధైర్యాన్ని ఇచ్చాయి. సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారులు కూడా పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎరువుల వినియోగం, కలుపు నివారణ, నీటి నిర్వహణపై రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తున్నారు. ఎల్‌నీనో ప్రభావం ఉంటుందనే ఆందోళనల నడుమ వరుణుడు చూపిన ఈ కరుణతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రైతాంగంలో మళ్లీ ఆశల చిగుర్లు తొడిగాయి. రానున్న రోజుల్లోనూ వర్షాలు అనుకూలిస్తే ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు లాభాల పంటగా నిలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి



# యోగా లేదా జిమ్.. ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్షియస్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానికం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**

శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది.



# ఈ వీకెండ్ ఓటీటీ వినోదాలివే..: 20కుపైగా సినిమాలు..




వైవిధ్యమైన కథలు, పాత్రలతో అలరించే నటుడు సత్యదేవ్ ఆయన కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'రావు బహదూర్'. వెంకటేశ్ మహా తెరకెక్కించారు. దీపా థామస్ కథానాయిక. విభిన్న కథా చిత్రంగా టాక్ తెచ్చుకున్న ఈ మూవీ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లోలో స్ట్రీమింగ్ అవుతోంది.



విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'గట్టా కుస్తీ 2'. ఇప్పుడీ చిత్రం నెట్‌ఫ్లిక్స్ (Netflix) వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. చెల్ల అయ్యావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో (Gatta Kusthi 2) రమ్యకృష్ణ, యోగిబాబు తదితరులు నటించారు.

వరలక్ష్మీ శరత్ కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. సంజీవ్ మేగోటి దర్శకుడు. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. 'రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందింది. తెలుగుతో పాటు, కన్నడ భాషలోనూ ఈ మూవీ అందుబాటులోకి వచ్చింది.



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. జీ 5 వేదికగా తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతోంది.




'చచ్చేంత ప్రేమ లేకపోతే అది లవ్వే కాదు..' అంటూ థియేటర్‌లో అలరించాడు యువ కథానాయకుడు హర్షిత్. స్నేహ మణిమేఖలైతో కలిసి అతడు నటించిన ప్రేమ కథా చిత్రం 'దీవాన'. శ్రీకాంత్ దర్శకుడు. యువతను ఆకట్టుకున్న ఈ మూవీ ఇప్పుడు ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

## సినిమాల్లోకి బాలయ్య కూతురు



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు బాలకృష్ణ కూతురు తేజస్విని నటిగా అరంగేట్రం చేయబోతుంది. హీరోయిన్‌గా ఓ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలా కాకుండా మెసేజ్ ఓరియెంటెడ్ కథతో ఈ సినిమా ఉండబోతున్నట్లు చెబుతున్నారు. స్పోర్ట్స్ డ్రామా థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో ఓ పవర్‌ఫుల్ రోల్‌లో తేజస్విని కనిపించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. కథతో పాటు తన పాత్రకు ఉన్న ఇంపార్టెన్స్ నచ్చి ఈ సినిమాలో నటించడానికి తేజస్విని అంగీకరించినట్లు సమాచారం. టాలీవుడ్ టాప్ డైరెక్టర్ ప్రజెంటర్‌గా వ్యవహరిస్తోన్న ఈ సినిమాలో కొత్త నటీనటులు లీడ్ రోల్స్ చేయబోతున్నారని సమాచారం. మోక్షజ్ఞ కంటే ముందుగానే తేజస్విని తెలుగు తెరకు పరిచయం కాబోతుండటం ఆసక్తికరంగా మారింది.



## ఆగస్టు 6న నాని 'ది ప్యారడైజ్' టీజర్..




కథానాయకుడు నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న చిత్రం 'ది ప్యారడైజ్' (The Paradise). తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నట్లు శ్రీకాంత్ ఓదెల ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇందులో నాని 'జడల్' (Jadal) పాత్రలో కనిపించనున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. నానితో పాటు ఈ మూవీలో మోహన్‌బాబు, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయికగా మెరవనున్నారు. ఈ మూవీ సెప్టెంబరులో థియేటర్లలో విడుదల కానుంది.

## ప్రొడ్యూసర్‌గా రకుల్!

రకుల్ ప్రీత్ సింగ్ కొత్త అవతారమెత్తబోతోంది. చాలాకాలంగా ఓ హిట్టు కోసం ఎదురుచూస్తోన్న ఈ అమ్మడు ఓ షాకింగ్ డెసిషన్ తీసుకున్నట్లు సమాచారం. నిర్మాతగా మారబోతుందట. తొలి ప్రయత్నంగా ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీని నిర్మించబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. క్రైమ్ కామెడీగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆమెనే హీరోయిన్‌గా నటించబోతున్నదని అంటున్నారు. మా ఇంటి బంగారం రీమేక్‌గా ఈ మూవీ తెరకెక్కబోతున్నట్లు సమాచారం. భర్త జాకీ భగ్నానీతో కలిసి ప్రొడ్యూస్ చేయబోతున్నట్లు చెబుతున్నారు. హిందీ వెర్షన్‌కు తగ్గట్లుగా కథలో చాలానే మార్పులు, చేర్పులు చేయబోతున్నారట. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు సమాచారం. కమ్ బ్యాక్ కోసమే ఈ రిస్క్ తీసుకుంటున్నట్లు చెబుతోన్నారు. దీంతోనైనా ఈ ఢిల్లీ బ్యూటీ సక్సెస్ బాట పడుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

## నాదియా.. సో బ్యూటీఫుల్

కియారా అద్వానీ బర్త్‌డే సందర్భంగా టాక్సిక్ మేకర్స్ ఆమెకు అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు విషెస్ చెప్పారు. ఇందులో నాదియా అనే పాత్రలో ఈ బాలీవుడ్ బ్యూటీ కనిపించబోతున్నట్లు వెల్లడించారు. ఈ పోస్టర్‌లో రెడ్ కలర్ డ్రెస్‌లో కియారా అద్వానీ స్టైలిష్‌గా కనిపిస్తోంది. ఆమె చూపుల్లోని ఇంటెన్సిటీ, రూబీ లిప్స్, రాయల్ లుక్ పోస్టర్‌కు హైలైట్‌గా నిలుస్తున్నాయి. బోల్డ్ అండ్ బ్యూటీఫుల్ అంటూ కియారా లుక్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా ఆమె పాత్ర చాలా మిస్టరీయస్‌గా ఉండబోతున్నట్లు ఈ పోస్టర్ ద్వారా హింట్ ఇచ్చారు. కేజీఎఫ్ ఫేమ్ యశ్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీ ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు.

## 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సూర్య అంగీకరించరేమోనని భయపడ్డా: వెంకీ అట్లూరి

'సార్', 'లక్కీ భాస్కర్' లాంటి వరుస విజయాలతో



జోరుమీదున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ఆయన దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. తమిళ స్టార్ హీరో సూర్య , మమితా బైజు జంటగా నటించారు. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వెంకీ అట్లూరి సినిమా విశేషాలను పంచుకున్నారు. "40 ఏళ్ల వయసున్న వ్యక్తి, 20 ఏళ్ల యువతితో ప్రేమలో పడటం ఈ సినిమా నేపథ్యం. ఇలాంటి భిన్నమైన కథను సూర్య అంగీకరిస్తారో లేదోనని భయపడ్డాను. అందుకే ముందుగా ఈ కథను సూర్య స్నేహితుడు రాజశేఖర్ పాండియన్‌కు చెప్పాను. ఆయనకు నచ్చడంతో తర్వాత సూర్యకు వినిపించాను. కథలో చిన్న చిన్న మార్పులు సూచించి ఆయన వెంటనే ఓకే చెప్పారు. అలా మూడు నెలల్లోనే షూటింగ్ ప్రారంభించాం. అందరికీ నచ్చేలా ముగింపు ఉండాలని సూర్య పట్టుబట్టారు. దీనికోసం క్లైమాక్స్‌ను దాదాపు 10సార్లకు పైగా మార్చి రాశాను. నా కెరీర్‌లోనే అత్యంత కష్టమైన రైటింగ్ ప్రాసెస్ ఇదే. ధనుష్, దుల్కర్, సూర్య.. వీరందరికీ క్రమశిక్షణ చాలా ఎక్కువ. సూర్య నాకు పెద్దన్నలాంటివారు. సెట్‌లో ఎప్పుడూ సీనియర్ నటులతో తనకున్న అనుభవాలను పంచుకుంటారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. 'ప్రేమలు' సినిమాలో మమితా బైజు నటన ఎంతో సహజంగా అనిపించింది. అందుకే 'విశ్వనాథ్ అండ్ సన్స్'కి తీసుకున్నాం. వీరిద్దరి జోడీ తెరపై చాలా బాగుంటుంది. నేను కలెక్షన్ల లెక్కలను ఎప్పుడూ నమ్మను. 100 మందిలో కనీసం 75 మందికి నా సినిమా నచ్చితే సంతృప్తి పడతాను.





## జననాయగన్ నిలిపివేత.. ఎందుకంటే

దళపతి విజయ్ జననాయగన్ సినిమా మరోసారి చిక్కుల్లో పడింది. జననాయగన్ ఆడుతోన్న థియేటర్ల వద్ద కన్నడ సంఘాలు నిరసనలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కావేరీ నదీ జలాల వినియోగానికి సంబంధించి కర్ణాటక, తమిళనాడు మధ్య సుదీర్ఘ కాలంగా వివాదాలు నడుస్తోన్నాయి. రోజూ 3500 క్యూసెక్కుల నీటిని తమిళనాడుకు విడుదల చేయాలని కావేరి వాటర్ రెగ్యులేషన్ కమిటీతో పాటు కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కర్ణాటకకు ఆదేశాలు జారీ చేయడంతో కొన్ని రాజకీయ పార్టీలతో పాటు కన్నడ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మాండ్యలోని గురుశ్రీ థియేటర్ వద్ద ఆందోళనకారులు సీఎం విజయ్ పోస్టర్లను చించేసి ప్రదర్శనను అడ్డుకున్నారు. ఉద్రిక్తతలు తగ్గే వరకు మూవీని ప్రదర్శించొద్దని థియేటర్ యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా ఈ మూవీ వారం రోజుల్లోనే 300 కోట్ల వసూళ్లను రాబట్టడం విశేషం.

## షూటింగ్‌లో రశ్మికకు తీవ్ర గాయం

టాలీవుడ్ స్టార్స్ వరుసగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఎన్టీఆర్, బాలకృష్ణ, రామ్‌చరణ్ గాయాల బారిన పడగా తాజాగా ఓ సినిమా షూటింగ్‌లో నేషనల్ క్రష్ రష్మిక మందన్న గాయపడింది. డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తోండగా కింద పడటంతో తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు తెలిసింది. షూటింగ్‌ను నిలిపివేసిన చిత్రబృందం ఆమెను హాస్పిటల్‌కు తరలించారు. ఆరు వారాల వరకు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. రిహాబిలిటేషన్ కూడా అవసరమని సూచించినట్లు తెలిసింది. దీంతో షూటింగ్‌లకు బ్రేక్ పడనుంది. కాగా ప్రస్తుతం తెలుగులో భర్త విజయ్ దేవరకొండతో కలిసి రణబాలి సినిమా చేస్తోంది రష్మిక.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.